సాక్షి వరంగల్

బుధవారం | 29 | మార్చి | 2023



ఏనుమాములలో వారిదే..

ఏనుమాముల ప్రాంతంలో దశాబ్దాల క్రితం కొన్న ప్లాట్లు పెద్ద సంఖ్యలో ఉండడంతో రెండు, మూడు గ్యాంగ్‌లుగా ఏర్పడి కొందరు కబ్జాలకు తెరలేపారు. - 8లో▸



విద్యారంగానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36^0/24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. పొడి వాతావరణంతోపాటు రాత్రిపూట చల్లగా ఉంటుంది.



ఇఫ్తార్	సహర్
బుధ 6:34	గురు 4:50

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ కీర్తినగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో నిర్వహిస్తున్న మహిళా ఆరోగ్య క్లినిక్‌ను కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ కలెక్టర్ వెంట రాగా.. క్లినిక్‌లో మహిళలకు అందిస్తున్న వైద్య సేవలను ఆమెకు వివరించారు. ప్రతీ మంగళవారం జిల్లాలో ఐదు మహిళా క్లినిక్‌ల ద్వారా సేవలు అందిస్తున్నామని, వాటిలో లేని వైద్య సేవలను నగరంలోని ఎంజీఎం ఆస్పత్రి, నర్సంపేట సీహెచ్‌సీల్లో పొందే అవకాశం ఉందని డీఎంహెచ్‌ఓ తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి అర్చన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ సంక్షోభంపై సదస్సు

గీసుకొండ: మండలంలోని కొనాయమాకుల సమీపంలో గల ఓంకార్ గార్డెన్స్‌లో బుధవారం 'సంక్షోభంలో భారత వ్యవసాయరంగం–పరిష్కారాలు, మార్గాలు, ప్రభుత్వాల బాధ్యత, మన కర్తవ్యం' అనే అంశంపై ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో మేధావులు, వ్యవసాయ రంగ నిపుణులు, రైతు సంఘాల నాయకులు పాల్గొంటారని, రైతులు అధికంగా పాల్గొనాలని కోరారు.

'49 కిలోలకు మించకుండా తేవాలి'



వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి తరలించే సరుకును 25 కిలోలకు తగ్గకుండా.. 49 కిలోలకు మించకుండా తేవాలని మార్కెట్ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. మంగళవారం వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డితో కలిసి మిర్చి యార్డులోని రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని యార్డుల్లోని రైతులకు కరపత్రాలను పంపిణీ చేయడంతోపాటు ఫ్లెక్సీలను ప్రదర్శించి.. వారికి అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే ఉమ్మడి వరంగల్‌లోని జిల్లా వ్యవసాయాధికారులకు, మండల స్థాయిలోని ఏఈఓల ద్వారా గ్రామాల్లో పంపిణీ చేసేందుకు ప్రతీ జిల్లాకు కరపత్రాలను సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్, గ్రేడ్–2 కార్యదర్శులు చందర్‌రావు, ఎండి.బియబానీ, మార్కెట్ కమిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలి



రాయపర్తి: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పట్టుదలతో ఇష్టపడి చదవాలని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్, జీసీడీఓ కుడికాల సుభాష్ అన్నారు. తిర్మలాయపల్లి గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని భోజనం, గదులు, డార్మెటరీ, స్టాక్, వసతులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినుల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ బుర్ర కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఐఆర్ఆర్'కు గ్రహణం..!

- పదకొండేళ్లుగా తెగని భూసేకరణ పంచాయితీ
- భూరికార్డులు సరిగా లేవంటున్న 'కుడా' అధికారులు
- మరోసారి నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్న కలెక్టర్
- రింగ్ రోడ్డు పూర్తయితే మారనున్న నగర రూపురేఖలు



వరంగల్‌లోని నాయుడు పెట్రోల్ పంపు సమీపంలో రోడ్డు నిర్మించే ప్రాంతం

సాక్షి, వరంగల్: జంట నగరాలపై ట్రాఫిక్ రద్దీ లేకుండా ఉండేందుకు ఉద్దేశించిన ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్ఆర్)కు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) గ్రహణం పట్టుకుంది. తొలిదశలో వరంగల్‌లోని నాయుడు పెట్రోల్ బంక్ నుంచి ఏనుమాముల వరకు 8 కిలోమీటర్ల మేర 200 ఫీట్ల రహదారి నిర్మించాలనుకున్నారు. అయితే భూసేకరణకు సంబంధించి పరిహారం విషయంలో ఇంకా అక్కడక్కడా చిక్కులొస్తున్నాయి. భూసేకరణకు హనుమకొండ ఆర్డీఓ రూ.60కోట్లు, వరంగల్ రెవెన్యూ నుంచి రూ.20కోట్లు.. దాదాపు 250 మంది నిర్వాసితులకు ఇచ్చినా.. మిగిలిన 110 మంది భూనిర్వాసితులకు పరిహారం ఇచ్చేందుకు కుడా చుక్కలు చూపెడుతోందనే విమర్శలున్నాయి. ఐఆర్ఆర్ భూనిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం డబ్బులు దాదాపు రూ.20కోట్లు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) రూపేణా వస్తున్న వడ్డీతో కుడా నిర్వహణ వెళ్లిపోతుందని, అందుకే పరిహారం విషయంలో కుడా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యుల నుంచి వచ్చే ఒత్తిళ్లతో కొందరు నిర్వాసితులకు మాత్రమే నయానో భయానో ముట్టజెబుతున్నారని, ఇతరుల భూపత్రాలు సరిగా లేవంటూ అన్నీ చెక్ చేసుకొని మరోసారి రావాలంటూ పంపుతున్నారన్న టాక్ ఉంది. అయితే రెవెన్యూ అధికారులు చేసిన ఎంజాయిమెంట్ సర్వేను కూడా పరిగణనలోకి తీసుకోకుండా.. కుడాకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సతాయిస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. కాగా.. 2018లో అప్పటి కలెక్టర్ ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్ గడువు ముగియడంతో తాజాగా మళ్లీ కలెక్టర్ ప్రావీణ్య భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

ఐఆర్ఆర్ వస్తే...

ఐఆర్ఆర్ వస్తే వరంగల్ నగర రూపురేఖలు మారనున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారులపై ప్రభావం చూపే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గనుంది. హైదరాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, నర్సంపేట, ఖమ్మం మీదుగా వచ్చే భారీ వాహనాలు ట్రైసిటీలోకి రాకుండా ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వెళతాయి. తొలి దశలో రంగశాయిపేట నుంచి నాయుడు పెట్రోల్ పంప్, గవిచర్ల క్రాస్ రోడ్డు, స్తంభంపల్లి, జాన్‌పీరీలు, కీర్తినగర్, ఏనుమాముల, రెండో దశలో కొత్తపేట నుంచి ఆరెపల్లి, దామెర రోడ్డు క్రాస్ వరకు నిర్మించాలని నిర్ణయించారు. 2012 నుంచి మొదలైన ఈ రోడ్డు భూసేకరణకు 89.36 ఎకరాలు అవసరం కాగా.. దాదాపు 70 ఎకరాల ప్రైవేట్ భూమి ఉంది. అయితే 360 మంది నిర్వాసితులున్నారని గుర్తించిన అధికారులు 250 మందికి పరిహారం చెల్లించారు. ఇంకొందరికి కుడా నిధులు చేతిలో లేకపోవడంతో ఏదో సాకుతో తిప్పుతున్నట్లు ప్రచారంలో ఉంది. 'మాది ఏనుమాములలో 200 గజాల ప్లాట్ ఉంది. అన్ని డాక్యుమెంట్లు సరిగా ఉన్నా మాకు పరిహారం ఇప్పించేందుకు సతాయిస్తున్నారు. ఏళ్లతరబడి తిరగాల్సి వస్తుంది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ రైతు చెప్పారు.

కేసులు, వివాదాల వల్లే...

ఐఆర్ఆర్ నిర్వాసితుల డబ్బులను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదు. అన్ని భూపత్రాలు సరిగా ఉండి.. రెవెన్యూ విభాగం పంపించినా ఎంజాయిమెంట్ సర్వే నివేదికలు ఆధారంగా చేసుకొని కొందరు నిర్వాసితులకు పరిహారం ఇస్తున్నాం. ఫ్యామిలీ వివాదాలు, కోర్టు కేసులు ఉన్న వాటిని మాత్రం పెండింగ్‌లో ఉంచాం. వీటిని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటిస్తున్నాం. కలెక్టర్ ప్రావీణ్య భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వగానే పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తాం. కోర్టు కేసుల్లో ఉన్నవాటి విషయంలో డబ్బులు కోర్టులోనే డిపాజిట్ చేస్తాం. అప్పుడు ఆ కేసు ఎవరు నెగ్గుతారో వారి ఖాతాల్లో ఆ డబ్బులు జమ అవుతాయి.

– అజిత్‌రెడ్డి, కుడా ప్లానింగ్ ఉన్నతాధికారి

గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు దోహదం

- నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు

కాజీపేట అర్బన్: భారత ప్రభుత్వ జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు దోహదపడే వేదికగా మాలిక్యూలర్ మెటీరియల్స్‌పై నిర్వహిస్తున్న అంతర్జాతీయ వర్క్‌షాప్ నిలవాలని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ వరంగల్‌లోని బోస్ సెమినార్ హాల్‌లో మంగళవారం కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో హిబ్రూ యూనివర్సిటీ ఆఫ్ జెరూసలేం, ఇజ్రాయిల్, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ స్పార్క్ (స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ అకాడమిక్ అండ్ రీసెర్చ్ కొలాబరేషన్) సౌజన్యంతో మాలిక్యూలర్ మెటీరియల్స్ అండ్ ఇంజనీరింగ్ అనే అంశంపై ఏర్పాటు చేసిన ఐదు రోజుల అంతర్జాతీయ సదస్సును ఎన్వీ.రమణారావు ప్రారంభించి మాట్లాడారు. కెమిస్ట్రీ విభాగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టేందుకు, ఆలోచనలకు వర్క్‌షాప్‌ను సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, డీన్ జయకృష్ణ, కాశీనాథ్, నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

సీబీకేఆర్–23 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్

నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సివిల్ ప్రొఫెసర్ కామేశ్వర్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా సీబీకేఆర్–23 (సిమెంట్ అండ్ బిల్డింగ్ కాంక్రీట్ ఫర్ ఎ సస్టేయినబుల్ రెసిలెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ కాన్ఫరెన్స్‌ను ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కలిదిండి సత్యనారాయణ, నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రతీష్‌కుమార్, వెంకటేశ్వరరావు, తేజస్వి, రవిప్రసాద్ పాల్గొన్నారు.

9 గ్రంథాలయాలకు పుస్తకాలు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి

వరంగల్ రూరల్: లీడ్ బ్యాంక్ మేనేజర్, యూబీఐ సహాయంతో రెండు జిల్లాల పరిధిలోని 9 గ్రామ గ్రంథాలయాలకు రూ.87,800 విలువైన పుస్తకాలను కొనుగోలు చేసి పంపిణీ చేశారని కలెక్టర్ పి.ప్రావీణ్య వెల్లడించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీసీసీబీ రూ.20వేలు, యూబీఐ రూ.15వేలు, ఎస్‌బీఐ రూ.10వేలు, కెనరా బ్యాంక్ రూ.10వేలు, ఏపీజీవీబీ రూ.5వేల చొప్పున అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, లీడ్ మేనేజర్ రాజు హవేలి, వివిధ బ్యాంకుల రీజినల్ మేనేజర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెల్లచామంతి పూలతో పుష్పార్చన

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు మంగళవారం తెల్లచామంతి పూలతో అమ్మవారికి పుష్పార్చన చేశారు. ఉదయం నుంచి వేదపండితులు, అర్చకులు అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించి అనంతరం చామంతి పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు.

ప్రాధాన్యత రంగాలకు రుణాలు

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య. పక్కన అదనపు కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్

వరంగల్ రూరల్: జిల్లా వార్షిక ప్రణాళికలో భాగంగా ప్రాధాన్యత రంగాలకు రూ.2,672.44కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య వెల్లడించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం ఎల్‌డీఎం (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రెడిట్ డిపాజిట్ 119.20 శాతం ఉందని చెప్పారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ)లో 67 యూనిట్లకు మంజూరు చేశామని, వీటిని మరింతగా పెంచాలని బ్యాంకర్లను ఆదేశించారు. 11,760 ముద్ర యూనిట్లకు రూ.107.13కోట్లు మంజూరు కాగా.. ఇప్పటివరకు 6,932 యూనిట్లకు రూ.26.80కోట్ల మొండి బకాయిలు(ఎన్‌పీఏ) ఉన్నాయని కలెక్టర్ వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి మాట్లాడుతూ బ్యాంకర్లు పంట రుణాల విషయంలో రైతులకు సహకరిస్తున్నారని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉషాదయాళ్ మాట్లాడుతూ బ్యాంకుల క్షేత్రస్థాయి అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు హవేలి మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.568కోట్ల రుణాలకు.. రూ.439కోట్లు ఇచ్చామని వెల్లడించారు. విద్యా రుణాలు(ఎడ్యుకేషన్ లోన్స్)కు రూ.25.04కోట్లు మంజూరు చేశామని చెప్పారు. కేసీసీ ద్వారా పశు సంవర్ధక రుణాలు 2,427 దరఖాస్తులకు.. 962 మంది రైతులకు రుణాలు మంజూరు చేశామన్నారు. జీవనజ్యోతి బీమా యోజన కింద రూ.436లతో 71,242 మంది నమోదు చేసుకున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) రీజినల్ మేనేజర్ పి.సత్యం, కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ మాధవి, ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, నాబార్డు డీడీఎం రవి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అనిల్‌కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్న ఇంట్లో తమ్ముడి చోరీ

- 75 గ్రాముల బంగారం
- రూ.1.40లక్షల నగదు స్వాధీనం
- నిందితుని అరెస్టు చూపిన ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ

వరంగల్ క్రైం: సొంత అన్న ఇంట్లో చోరీకి పాల్పడిన తమ్ముడిని 24 గంటల్లోపు చెన్నారావుపేట పోలీసులు అరెస్టు చేసి 75 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.40లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్లా కరుణాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనాపురం గ్రామానికి చెందిన మండల రవి రోజువారీ కూలీ చేస్తూ వచ్చిన డబ్బులతో మద్యం సేవించి జల్సాలకు అలవాటుపడ్డాడు. అప్పులు అధికమవడంతో ఎలాంటి పనులు చేయకుండా కేవలం మద్యం సేవిస్తూ కాలం గడుపుతున్నాడు. అప్పు చేసిన చోట ఒత్తిళ్లు పెరగడంతో సులభంగా డబ్బులు సంపాదించాలని రవి ప్రణాళిక రూపొందించుకున్నాడు. రవి తన అన్న సుధాకర్ కుమారుడి వివాహం ఇటీవల కావడంతో ఇంట్లో ఎక్కువ డబ్బులతోపాటు బంగారు ఆభరణాలు ఉన్నాయని భావించి చోరీ చేసేందుకు సిద్ధపడ్డాడు. ఈనెల 26న సుధాకర్ కుటుంబ సభ్యులు వేములవాడకు వెళ్లడాన్ని గమనించి ఇంట్లోకి దూరి బంగారు ఆభరణాలు, డబ్బును చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నెక్కొండ ఇన్‌స్పెక్టర్ హతీరాం విచారణ చేశారు. విచారణలో ఫిర్యాదుదారుడి తమ్ముడిపై అనుమానంతో అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకొని తన అన్న ఇంట్లో తమ్ముడే చోరీకి పాల్పడినట్లుగా నిర్ధారించిన పోలీసులు నిందితుడిపై నిఘా పెట్టారు. మంగళవారం చోరీ సొత్తులో కొంత డబ్బును తీసుకునేందుకు నిందితుడు ఇంటికి రావడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు, నెక్కొండ ఇన్‌స్పెక్టర్ హతీరాం, చెన్నారావుపేట ఎస్సై టి.మహేందర్, కానిస్టేబుల్ కత్తి సురేశ్, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

క్యూఆర్ కోడ్‌తో స్ప్రింగ్‌స్ప్రీ–23



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాఉత్సవంలో పాల్గొనేందుకు ఈ ఏడాది వినూత్నంగా క్యూఆర్ కోడ్‌తో రిజిస్ట్రేషన్ ప్రక్రియ అమలు చేయనున్నారు. ప్రతి ఏడాది ఈ–మెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లలో విద్యార్థులు పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహిస్తుండగా.. ఈసారి స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకల్లో ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం స్ప్రింగ్‌స్ప్రీ–23లోకి ప్రవేశించి ఎంజాయ్ చేయండి అంటున్నారు నిర్వాహకులు.

యువతే లక్ష్యం.. గంజాయి విక్రయం

- ఉన్నత విద్యాసంస్థలు, బెల్ట్ షాపులే అడ్డాలు
- విద్యార్థులు, యువతకు అమ్మేందుకు సీక్రెట్ కోడ్‌లు
- తనిఖీలు ముమ్మరం చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- నిత్యం ఏదో ఒకచోట పట్టుబడుతున్న వైనం



గంజాయి ముఠాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు(ఫైల్)

జిల్లాలో పట్టుకున్న గంజాయి వివరాలిలా...	
సంవత్సరం	పట్టుబడింది(కిలోల్లో..)
2007	47
2019	44
2020	45
2021	11
2022	595

నర్సంపేట: విద్యాసంస్థలు, విద్యార్థులు, యువతే లక్ష్యం. గంజాయి విక్రయమే వారి వ్యాపారం. టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రత్యేక నిఘాతో కట్టడి చేస్తున్నా.. నిత్యం ఎక్కడో ఒకచోట ముఠాలు పట్టుబడటం. సీక్రెట్ కోడ్ ఆధారంగా ఉన్నత విద్యాసంస్థలు, బెల్టు షాపులను అడ్డాగా చేసుకుని అమ్మకం. నర్సంపేటలో గంజాయి సాగు లేకపోయినా ఘాటు మాత్రం గుప్పుమంటోంది. జిల్లాలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 16 చోట్ల ఎండు గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. 48 మందిని అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి 276 కేజీల శుద్ధి చేసిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గంజాయి విక్రయాలు పెరుగుతున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో గంజాయి సాగు ఎక్కువగా ఉండటం, దానిని సేవించడం వల్ల ఎదురయ్యే అనర్థాలపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పించడంతో సాగు తగ్గుముఖం పట్టింది. అయితే ఇతర ప్రాంతాల నుంచి ఎండు గంజాయిని తెచ్చి ఇక్కడ విక్రయించడం పరిపాటిగా మారింది. జిల్లాలోని నర్సంపేటతోపాటు వరంగల్, వర్ధన్నపేట పట్టణాల్లో యువత గంజాయిని సేవించే సంస్కృతి పెరిగింది. గంజాయి విక్రయదారులు విద్యార్థులు, యువతే లక్ష్యంగా అడ్డాలను ఏర్పాటు చేసుకోగా.. అదే స్థాయిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టడం.. నిరంతరం తనిఖీలు చేయడం సత్ఫలితాలిస్తోంది.

రూటు మార్చిన ముఠా..

ఇదే క్రమంలో భద్రాచలం నుంచి డీసీఎం వాహనం ఖానాపురం మీదుగా వరంగల్‌కు వెళ్తున్న క్రమంలో బోల్తా పడింది. దీంతో అందులో గంజాయి రవాణా అవుతున్నట్లు బయటపడింది. గతంలో భద్రాచలం, ఖమ్మం, ఇతర ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎండు గంజాయిని పెద్ద వాహనాల్లో వరంగల్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో నర్సంపేటలో పట్టుకున్న కేసులో ద్విచక్ర వాహనాన్ని ఉపయోగించడం చూస్తే విక్రయ ముఠా గంజాయిని తరలించే విధానాన్ని మార్చినట్లు తెలుస్తోంది. ఈనెల 23న నర్సంపేటలోని మాధన్నపేట రోడ్డు సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో ఇద్దరు యువకులు మూడు కిలోల 200 గ్రాముల ఎండు గంజాయిని ప్యాకెట్లు చేసి సరఫరా చేసేందుకు సిద్ధం చేయగా.. టాస్క్‌ఫోర్స్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు.

సీక్రెట్ కోడ్‌లు..

ఎండు గంజాయిని విక్రయించేందుకు యువతను లక్ష్యంగా చేసుకుని ముఠాలు సీక్రెట్ కోడ్‌లు కూడా ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. విద్యాలయాల సమీపంలో, బెల్ట్ షాపుల వద్ద గంజాయిని విక్రయిస్తుండడంతో విద్యార్థులపై ప్రభావం పడుతుంది. రాత్రి సమయాల్లో విద్యార్థులు చిత్తుబొత్తు ఆటలను కూడా ఏర్పాటు చేసుకుని గంజాయి సేవించడంతో గతంలో ఘర్షణలు జరగగా.. నర్సంపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న బెల్ట్ షాపులపై పోలీసులు గంజాయి విక్రయాల విషయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

ప్రత్యేక నిఘా పెట్టాం..



గంజాయి విక్రయాలపై జిల్లాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కువగా యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయాలకు ముఠా పాల్పడుతోంది. ఉన్నత విద్యాలయాల్లో విద్యనభ్యసించే విద్యార్థుల్లో మార్పు కనిపిస్తే విద్యాసంస్థల బాధ్యులు తల్లిదండ్రులకు తెలియజేయాలి. గంజాయి సేవించినా, అమ్మినా ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటాం.

– జితేందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ

టెన్త్ విద్యార్థులకు మోటివేషన్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆజాం

వర్ధన్నపేట: నల్లబెల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్షలపై అవగాహన కల్పించి వారిని మోటివేషన్ చేశారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, జాతీయ యువజన అవార్డు గ్రహీత, కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ మహ్మద్ ఆజాం మోటివేషన్ స్పీకర్‌గా వ్యవహరించి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేశారు. హెచ్‌ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడ్జెట్ @ రూ.389కోట్లు

అలరించిన కవి సమ్మేళనం

'విద్యార్థి ఉద్యమకారుల సభ'కు అనుమతి నిరాకరణ

- 10లో▸

విభజన హామీలు విస్మరించిన కేంద్రం

- పరిశ్రమల ఏర్పాటుతోనే ఉద్యోగావకాశాలు
- ప్రజా పోరుయాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

నర్సంపేట/వర్ధన్నపేట/నెక్కొండ: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందకుండా కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డుతోందని, విభజన హామీలను విస్మరించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరుయాత్ర మంగళవారం నర్సంపేట, వర్ధన్నపేట, నెక్కొండ మండల కేంద్రాల్లో కొనసాగింది. యాత్రకు మహిళలు మంగళహారతులు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు ఎర్ర దుస్తులు ధరించి, పార్టీ జెండాలు చేబూని ప్రదర్శన నిర్వహించారు. నర్సంపేట, నెక్కొండలో అంబేడ్కర్ విగ్రహానికి శ్రీనివాసరావు పూలమాల వేశారు. నెక్కొండ మండలం పనికర శివారులో గుడిసెవాసులను ఆయన కలిశారు. ఆయా ప్రాంతాల్లో శ్రీనివాసరావు మాట్లాడుతూ బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామని, పేదలకు గూడు దక్కేవరకు తమ పోరాటం ఆగదన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఎంతటి వారున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన జీఎస్టీ, ఇతర నిధులను రాకుండా ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ కేంద్రం తీరని అన్యాయం చేసిందన్నారు. తెలంగాణ ప్రజలపై వివక్ష, విద్వేషాన్ని ప్రదర్శిస్తున్న ప్రధాని మోదీకి ఇక్కడ ఓట్లు అడిగే నైతిక అర్హత లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో వరంగల్, మహబూబాబాద్, ములుగు, హనుమకొండ, భూపాలపల్లి జిల్లా కార్యదర్శులు మేకల రవి, బి.విజయసారథి, మల్లికార్జున్‌రావు, భిక్షపతి, రాజ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, బాషుమియా, విశ్వేశ్వర్‌రావు, చెన్నకేశవులు, సదాలక్ష్మి, శ్రీనివాస్, ఎల్లేష్ పాల్గొన్నారు.

డిక్కీ నుంచి రూ.5 లక్షలు అపహరణ

కాజీపేట: ద్విచక్ర వాహనంలో ఉన్న రూ.5 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లినట్లు బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం .. పద్మ అరవింద న్యాయవాది వద్ద పని చేస్తున్న పూలరాజు, గుండు శ్రీనివాస్‌లు ఆఫీసు పని మీద వడ్డేపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్దకు మంగళవారం చేరుకోగా.. బ్యాంకులో సర్వర్ బిజీగా ఉందని వెనక్కి వచ్చారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇద్దరు ఇంటికి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత స్కూటీ డిక్కీలో చూడగా.. రూ.5లక్షల నగదు కనిపించకపోవడంతో కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. పోలీసులు విభిన్న కోణాల్లో విచారణ జరుపుతున్నారు. నగదుతో రాజు, శ్రీనివాసులు తిరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. న్యాయవాది వద్ద పని చేసే సిబ్బందికి పత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గీత కార్మికుడిని కాపాడిన గ్రామస్తులు


జేసీబీ సాయంతో సోమన్నను కాపాడిన గ్రామస్తులు

కొడకండ్ల: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కారుపోతుల సోమన్న సోమవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ఆకస్మాత్తుగా బలంగా ఈదురు గాలి వీచింది. దీంతో మోకు జారి తల కిందకు అయింది. చెట్టుకు వేలాడుతూ ప్రాణాపాయంలో ఉన్న సోమన్న పరిస్థితిని గమనించిన తోటి గీత కార్మికుడు బాల్నె కుమార్ చెట్టు ఎక్కి గ్రామస్తుల సహకారంతో సోమన్నను తాళ్లతో కట్టి కిందకు దించేందుకు యత్నించాడు. గ్రామస్తులు పక్కనే పనులు నిర్వహిస్తున్న జేసీబీని తీసుకొచ్చి ముందు డబ్బాలో ఇద్దరు కూర్చుని చెట్టుపైకి వెళ్లి వేలాడుతున్న సోమన్నను సురక్షితంగా కిందకు దించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన గ్రామస్తులు గీతకార్మికుడి ప్రాణాల్ని కాపాడారు.

రాత్రంతా రిజిస్ట్రార్ చాంబర్‌లో నిరసన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మధ్యాహ్నం వరకు రిజిస్ట్రార్ చాంబర్‌లోనే బైఠాయించి నిరసన తెలిపారు. సోమవారం సాయంత్రం రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాత్రి మొత్తం అక్కడే ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు నిరసన కొనసాగింది. సెనేట్ సమావేశం ముగిశాక పాలకమండలి సభ్యులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అంతకుముందు పాలక మండలి సభ్యుడు టి.మనోహర్ సెనేట్ సమావేశంలో ఉండగా.. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన విషయం తెలిసి ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాలు చెల్లించాల వీసీని కోరారు. దీనిపై వీసీ రమేశ్ స్పందిస్తూ వీరి నియామకం వివాదాస్పదమైందని, తన చేతిలో ఏమీ లేదని తెలిపారు. వీరి వేతనాల విషయంలోనే తనపై కేసు నమోదైందని వాపోయారు. కాగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యను అకాడమిక్ సెనేట్‌లో చర్చించడం సరికాదని, పాలకమండలి సమావేశంలో చర్చించుకోవాల్సి ఉంటుందని కేయూ మాజీ వీసీ గోపాల్‌రెడ్డి తెలిపారు.

@ స్వేచ్ఛాగానం



కొత్తగూడ: ఇన్నాళ్లు జూ పార్కులో సందర్శకుల కోసం బందీలుగా ఉన్న చుక్కల దుప్పులను జూ, ఫారెస్ట్ అధికారులు మంగళవారం అటవీ ప్రాంతంలో వదిలారు. హైదరాబాద్ జూలో ఉన్న ఐదు ఆడ, ఐదు మగ చుక్కల దుప్పులను కొత్తగూడ మండలం ఓటాయి బీట్ పరిధిలో ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన సోలార్ పంప్ వద్ద వదిలారు. అడవిలో దుప్పుల సంఖ్య పెరగడంతో జీవ వైవిధ్యం మెరుగు పడుతుందని డీఎఫ్ఓ రవికిరణ్ తెలిపారు. దుప్పుల రక్షణ కోసం ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

@ ప్రాణాపాయం


దుప్పితో అటవీ శాఖ అధికారులు



ఎస్ఎస్ తాడ్వాయి: అడవిలో స్వేచ్ఛగా గెంతుతున్న దుప్పి వేటగాళ్ల బాణానికి గాయపడింది. రేంజ్ అధికారి షౌకత్ హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ డ్యూటీలో భాగంగా మంగళవారం మేడారం బీట్ పరిధిలోని అడవి ప్రాంతంలో సెక్షన్, బీట్ ఆఫీసర్, వాచర్ అడవిలో విధులు నిర్వర్తిస్తుండగా.. పరుగెడుతూ కింద పడిన చుక్కల దుప్పిని పరిశీలించగా.. శరీరంలో బాణం గుచ్చుకొని ఉంది. వెంటనే అటవీ అధికారులు దుప్పిని తాడ్వాయి పశువైద్యశాలకు తీసుకెళ్లి బాణాన్ని తొలగించి చికిత్స అందించారు.

@ 'డెవిల్ ఫిష్' లభ్యం

- జాలర్ల వలకు చిక్కిన 38కేజీల బరువున్న అరుదైన చేప



కాళేశ్వరం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ పరిధిలోని ప్రాణహిత నదీ పరీవాహక ప్రాంతంలో జాలర్ల వలకు మంగళవారం 38కేజీల బరువున్న అరుదైన డెవిల్‌ఫిష్ చిక్కింది. ఈ చేపను సిరొంచ ప్రాంతంలో బోధ్ అని కూడా అంటారని జాలర్లు పేర్కొన్నారు. అరుదుగా ఛత్తీస్‌గఢ్‌లో లభించే ఈ చేపలు సుమారుగా 50–70కిలోల వరకు బరువు ఉంటాయని, అధిక మాంసాహారం తింటుందని, ప్రొటీన్లు కూడా అధికంగా ఉంటాయని జాలర్లు తెలిపారు.

ఉంగరం పోయిందని.. ఉసురు తీసుకుంది


హేమలతరెడ్డి (ఫైల్)

దంతాలపల్లి: ఉంగరం పోయిందని మండలంలోని గున్నెపల్లి గ్రామానికి చెందిన మద్దుల హేమలతరెడ్డి(19) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హేమలతరెడ్డి హనుమకొండలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఉగాది పండుగ కోసం ఇటీవల ఇంటికి వచ్చిన హేమలతరెడ్డి చేతి ఉంగరం పోయింది. దీంతో మనస్తాపానికి గురైన సదరు యువతి ఇంట్లో వాళ్లు ఏమైనా అంటారనే భయంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సూసైడ్ లెటర్ రాసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి మద్దుల జానకీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కూచిపూడి జగదీశ్ తెలిపారు.

ఏనుమాములలో వారిదే హవా!



వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 14వ డివిజన్ ఏనుమాముల ప్రాంతంలో దశాబ్దాల క్రితం కొన్న ప్లాట్లు పెద్ద సంఖ్యలో ఉండడంతో రెండు, మూడు గ్యాంగ్‌లుగా ఏర్పడి కొందరు కబ్జాలకు తెరలేపారు. ఓ గ్యాంగ్‌కు రాజకీయంగా పలుకుబడి ఉన్న వారి ఆశీస్సులు ఉండగా.. మిగిలిన గ్యాంగులకు రాజకీయ, సామాజిక ఉద్యమాలకు చెందిన వారు నేపథ్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కాని సమయంలోని ఏనుమాముల గ్రామ పంచాయతీ పరిధిలో సుందరయ్యనగర్, బాలాజీనగర్, మణికంఠకాలనీ, మధురానగర్, లక్ష్మీగణపతి కాలనీ, సాయి గణేశ్‌నగర్, ఎస్ఆర్‌నగర్, గాంధీనగర్, ప్రతాప రుద్ర కాలనీ, ముసలమ్మకుంట, చాకలి ఐలమ్మ నగర్ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాలను ప్లాట్లు చేసి విక్రయించారు.

- ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా
- పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినా పట్టింపు శూన్యం
- సీపీ దృష్టికి వెళ్లడంతో టాస్క్‌ఫోర్స్ రంగ ప్రవేశం
- అదుపులో కార్పొరేటర్ భర్త, మరో నలుగురు నేతలు
- పరిశీలనలో మరికొంత మంది నేతల జాబితా

వరంగల్ నగరానికి అతి సమీపంలో ఉన్నప్పటికీ లేఔట్ తదితర ఆంక్షలు లేక పోవడం, తక్కువ ధరలకు ప్లాట్లు లభిస్తుండడం, భవనాలు నిర్మించుకుంటే అనుమతులు సులభంగా వస్తుండడంతో వందలాది మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. 200 గజాల ప్లాటు కేవలం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల లోపు రావడంతో మధ్యతరగతికి చెందిన వారు ఎక్కువ మంది కొన్నారు. ఆర్థికంగా ఉన్న వారు అప్పుడు తాత్కాలికంగా ఇల్లు, షెడ్లు, ప్రహరీలు నిర్మించుకుని గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నంబర్లు పొందడంతో వారు కబ్జా రాయుళ్ల నుంచి తప్పించుకున్నారు. భవిష్యత్‌లో తమ పిల్లల అవసరాలు, పెళ్లిళ్లకు అక్కరకు వస్తాయని కొనుగోలు చేసిన వారు మాత్రం ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో ఏనుమాముల గ్రామ పంచాయతీ విలీనం అవుతుందని తెలిసిన వారు చాలా మంది ముందస్తుగా ఇంటి నంబర్లు పొందారు. కొంత మంది కొన్నప్పటికీ స్థానికంగా లేక పోవడం వల్ల రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి కదా.. అనే ధీమాతో ఉన్న వారు ఇప్పుడు అష్టకష్టాలు పడుతున్నారు.

పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ధరణి పోర్టల్‌లో కాస్తు కాలంలో సైతం పట్టాదారుడి పేరు రావడంతో కబ్జా రాయుళ్ల పంట పండుతోంది. అప్పటి పట్టాదారులకు చెందిన వారసుల (హక్కుదారుల)తో ఇప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకొని ప్లాట్లను అక్రమించుకునే పనిలో పడ్డారు. దీంతో బాధితులు తమ ప్లాట్లను ఆక్రమించుకుంటున్నారని పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. రాజకీయ నేతల ఒత్తిళ్లతో పోలీసులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోయినట్లుగా తెలుస్తోంది. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఏవీ.రంగనాథ్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంటనే భూకబ్జాదారులు, అక్రమణల గ్యాంగ్‌లపై దృష్టి పెట్టడంతో బాధితులు కమిషనర్ కార్యాలయం దారి పట్టారు. భూకబ్జాలు, అక్రమణల వల్ల ప్రభుత్వానికి సైతం అపవాదు వస్తున్నందున అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే అధికార పార్టీకి చెందిన వారైనప్పటికీ ఆక్రమణ, కబ్జాలకు పాల్పడితే చర్యలు తీసుకున్నట్లుగా సమాచారం.

కబ్జాదారులకు ఫైనాన్షియర్ల అండ

ఏనుమాముల, కోటిలింగాల గుడి ప్రాంతాల్లో కబ్జాలకు పాల్పడే గ్యాంగులకు కాశిబుగ్గకు చెందిన ఇద్దరు, ముగ్గురు ఫైనాన్సియర్లు ఆర్థికంగా సహాయం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుమారు రూ.కోటి విలువగల ప్లాట్లకు రూ.5 నుంచి రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే వచ్చిన మొత్తంలో సగం ఫైనాన్సర్లు తీసుకుంటున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ప్లాట్ దక్కని పరిస్థితుల్లో సైతం పెట్టిన పెట్టుబడి గుడ్‌విల్ కింద వస్తేనే వదిలివేస్తున్నట్లుగా తెలిసింది. ఇందులో ఒక ఫైనాన్సర్ వివాదాస్పద భూములు కొనేందుకు మాత్రమే పెట్టుబడి పెడుతున్నట్లుగా తెలిసింది.

టాస్క్‌ఫోర్స్ అదుపులో ఐదుగురు, రాత్రి విడుదల

- కార్పొరేటర్ భర్తతో సహా నలుగురు నేతలు


కాశిబుగ్గ కార్పొరేషన్ సర్కిల్ కార్యాలయం ముందు పోలీసు వాహనాలు

ఏనుమాముల ప్రాంతంలో పలు భూ వివాదాల్లో జోక్యం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో 14వ డివిజన్ అధికార పార్టీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య, బాలాజీనగర్‌కు చెందిన మాజీ కారోబార్ తూర్పాటి రఘు, తూర్పాటి శ్రీను, సుందరయ్యనగర్‌కు చెందిన జంగం రాజు, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గండ్రతి భాస్కర్‌లను మంగళవారం ఉదయం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దేశాయిపేటతోపాటు 14వ డివిజన్‌లోని బాలాజీనగర్, మధురానగర్, కోటిలింగాల దేవాలయం, మణికంఠకాలనీల్లోని స్థలాలను ఆక్రమించుకొని సంబంధిత యాజమానులను బెదిరింపులకు పాల్పడినట్లుగా వీరందరిపై ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో పలు ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఏనుమాముల గ్రామ పంచాయతీలో ఉద్యోగిగా పని చేసిన ఓ వ్యక్తి పోస్టుకు రాజీనామా చేసి బంధువులైన అధికార పార్టీ నేత, నాయకులతో కలిసి భూదందాలపై పడినట్లుగా తెలిసింది. ఈ వ్యవహారం వర్ధన్నపేట ఎమ్మెల్యే దృష్టికి రావడంతో సదరు నేతను భూ వివాదాల్లో జోక్యం చేసుకోవద్దని బహిరంగంగా హెచ్చరించినట్లు తెలిసింది. దీనికి తోడు రాష్ట్రస్థాయి ముఖ్య నేతల భూముల్లోనూ జోక్యం చేసుకోవడం వల్లే టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరి అరెస్ట్ విషయంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులను వివరణ కోరగా విచారణ కోసం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి కాశిబుగ్గలోని గ్రేటర్ వరంగల్ సర్కిల్ కార్యాలయానికి మూడు పోలీసు వాహనాలు వచ్చాయి. కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో పోలీసులు భూ అక్రమణల ఆరోపణలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. కాగా.. అదుపులోకి తీసుకున్న ఐదుగురిని రాత్రి పోలీసులు విడుదల చేశారు. అదేవిధంగా వరంగల్ తూర్పునకు చెందిన మరో నలుగురు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల పేర్లు ఆక్రమణలు పాల్పడే వారి జాబితాలో ఉన్నట్లుగా తెలిసింది. ఇప్పటికే ఆ స్థలాలను ఆక్రమించుకుని వారి అధికారంతో ప్రహరీలు, తాత్కాలిక షెడ్లను నిర్మించి ఇంటి నంబర్లు సైతం తీసుకున్నట్లు తెలిసింది.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

- మంత్రి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వందే మాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 50 రోజులుగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కొనసాగుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల అధ్యయన శిబిరం మంగళవారం డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్‌లో ముగిసింది. ఈసందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు, జిల్లా కలెక్టర్ కె.శశాంక పాల్గొన్నారు. వీఎంఎఫ్ వ్యవస్థాపకులు తక్కెళ్లపల్లి రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదోతరగతి విద్యార్థులకు 50 రోజుల పాటు తొర్రూరులో వందే మాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వసతి, భోజనంతో కూడిన వార్షిక పరీక్షల అధ్యయన శిబిరం నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ ఫౌండేషన్‌లో బాలికల వసతికై రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకై విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రైనీ కలెక్టర్ పింకేశ్‌కుమార్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ సంస్థ చైర్మన్ లక్ష్మారెడ్డి, డీఈఓ రామారావు, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఆర్డీఓ ఎల్.రమేశ్, మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంటా రవీందర్, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్


మాట్లాడుతున్న ఏసీపీ, పక్కన సీఐ, ఎస్ఐ

జనగామ: జనగామలో ఆర్థిక లావాదేవీల విషయంలో జరిగిన గొడవలో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెట మండలం బొమ్మకూరుకు చెందిన మాలోతు విజయ, భర్త తిరుపతి మధ్య మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. దీంతో విజయ తన ముగ్గురు పిల్లలను తీసుకుని జనగామ పట్టణం గుండ్లగడ్డకు మకాం మార్చింది. కుటుంబ పోషణ కోసం హైదరాబాద్ లక్డీకపూల్ ఓఫంక్షన్ హాల్‌లో క్యాటరింగ్ పనికి కుదిరింది. ఈసమయంలో కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లా గ్రామానికి చెందిన లేబర్ కాంట్రాక్టర్ మాలోతు మోహన్‌రావుతో పరిచయం ఏర్పడింది. ఆయనతో సహజీవనం చేస్తూ వారిద్దరూ జనగామలో స్థిరపడ్డారు. ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 25న రాత్రి 9 గంటలకు మోహన్‌రావు ఆమెతో గొడవకు దిగాడు. ఈసమయంలో పక్కనే ఉన్న రోకలి బండ తీసుకుని తలపై బాదాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో ఆమె కుప్పకూలింది. విషయం తెలుసుకున్న కుమారుడు, అతడి స్నేహితులు విజయను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా.. ఆమె అప్పటికే మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈక్రమంలో మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఎస్ఐలు రఘుపతి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా నిందితుడు మోహన్‌రావు పట్టుబడ్డాడు. పూర్తి సాక్ష్యాధారాలతో ఆయనను కోర్టులో రిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ సృజన్, పీసీలు కె.అనిల్‌కుమార్, వి.కిరణ్ కుమార్, ఎస్.సాగర్, అనిత ఉన్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన వారిని ఏసీపీ అభినందించారు.

నగల దొంగ అరెస్ట్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో నగల దొంగను పోలీసులు అరెస్టు చేశారు. వెంకటాపురం సీఐ శివప్రసాద్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం ఎస్సై తిరుపతితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. అదే సమయంలో ఒక వ్యక్తి బ్యాగుతో అనుమానాస్పదంగా వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. పారిపోతున్న వ్యక్తిని వెంబడించి పట్టుకుని విచారించారు. అతడిని ఏటూరునాగారం మండలం రామ్‌నగర్‌కు చెందిన కాలాల రవిగా గుర్తించారు. అతడు పలు దొంగతనాలు చేసినట్లుగా విచారణ తేలింది. అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా.. సుమారు రూ.ఏడు లక్షల విలువైన బంగారు ఆభరణాలు లభించాయి. రవిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. ఒకరి మృతి

- నిలిచి ఉన్న వాహనాన్ని ఢీకొన్న బస్సు
- అక్కడికక్కడే ఒకరి మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



శ్రీను (ఫైల్) శ్రీను మృతదేహం

రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం శివారులో మిర్చి లోడుతో వెళ్తున్న ఓ మినీ గూడ్స్ టైర్ పంక్చరై రోడ్డు పక్కన నిలిపి ఉంచిన క్రమంలో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈఘటనలో సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మొగ్గయ్యగూడెం రోళ్లబండ తండాకు చెందిన ధరావత్ శ్రీను(46) అక్కడికక్కడే మృతి చెందాడు. రైతులు వెంకన్న, భీమాకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీను వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అందులో భాగంగా 20 గుంటల్లో మిర్చి సాగు చేశాడు. మిర్చిని అమ్మేందుకు అతడి తమ్ముడు ధరవత్ భీమాకు చెందిన టాటా మినీ గూడ్స్‌లో మరో రైతు బానోతు వెంకన్నకు చెందిన మిర్చి బస్తాలను లోడ్ చేసుకొని మంగళవారం తెల్లవారుజామున వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు బయల్దేరారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం శివారులో మినీ గూడ్స్ పంక్చర్ అయింది. దీంతో వాహనాన్ని నిలిపి చూస్తుండగా.. ఖమ్మం నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న లగ్జరీ బస్సు వేగంగా మినీ గూడ్స్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. ఈఘటనలో తలకు బలమైన గాయాలవడంతో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. రైతులు వెంకన్న, భీమాకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అజాగ్రత్తగా నడిపి తన భర్త మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్ ఎ.భగవత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ధారవత్ బుజ్జి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై సదానందం తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..


అశోక్(ఫైల్)

నెక్కొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని నెక్కొండకు చెందిన చొప్పరి అశోక్(28) మంగళవారం మృతి చెందాడు. అశోక్ రెండు నెలల నుంచి అప్పల్‌రావుపేటలోని అమ్మమ్మ భద్రమ్మ వద్ద ఉంటున్నాడు. గ్రామంలోని ఊర చెరువులో చేపలు తీసుకొచ్చేందుకు బైక్‌పై వెళ్లాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వాహనం ఊర చెరువు కట్టపై ఢీకొంది. ఈ ఘటనలో అశోక్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కెన్యాలో ధర్మరావుపేట రైతు..


బ్రహ్మచారి(ఫైల్)

ఖానాపురం: మండలంలోని ధర్మరావుపేటకు చెందిన పడకంటి బ్రహ్మచారి(55) కెన్యాలో మృతి చెందాడు. బ్రహ్మచారి ఇరవై ఏళ్ల క్రితం కెన్యాలోని తాంజానియాలో స్థిరపడ్డాడు. అక్కడ సుమారు 25 ఎకరాల వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో పంట చేను వద్ద చెట్లపై ఉన్న తేనెటీగలు దాడి చేశాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అతడు మంగళవారం మృతి చెందాడు. బ్రహ్మచారి గ్రామాభివృద్ధికి తనవంతుగా తరచూ సహకారం అందించేవారని గ్రామస్తులు కేఎస్‌చారి, కోటి, వెన్ను పూర్ణచందర్, విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ బాధ్యులు తెలిపారు.

ఊపిరాపిన ఫ్యాన్!

- ఊడిపడి బాలిక మృతి


శ్రావణి (ఫైల్)

పెద్దవంగర: గాలినివ్వాల్సిన ఫ్యాన్ ఊడిపడి ఓ చిన్నారిని ఊపిరిని ఆపేసింది. హాయిగా నిద్ర పోయిన చిన్నారి.. తీవ్ర గాయాలై శాశ్వత లోకాలకు వెళ్లిపోయింది. నిద్రిస్తుండగా ఫ్యాన్ ఊడి పడి మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రామచంద్రు తండాకు చెందిన జాటోతు యాకులు, లలిత దంపతుల మొదటి సంతానం శ్రావణి(9) మృతి చెందింది. శ్రావణి మూడో తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి ఇంట్లో కుటుంబీకులతో కలిసి నిద్రకు ఉపక్రమించింది. ఈక్రమంలో ప్రమాదవశాత్తు సీలింగ్ ఫ్యాన్ శ్రావణిపై పడింది. తీవ్ర గాయాలవడంతో తల్లిదండ్రులు తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఖమ్మంకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రావణి మంగళవారం మృతి చెందింది. తొమ్మిదేళ్లకే నూరేళ్లు నిండాయా అని తల్లిదండ్రుల రోదించిన తీరు తండా వాసులను కంటతడి పెట్టించింది.

ప్రాణం తీసిన ఈత సరదా

- వాగులో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన


బండారి అఖిల్ (ఫైల్)


హర్షవర్ధన్ (ఫైల్)


ఆస్పత్రి వద్ద ఏడుస్తున్న తల్లిదండ్రులు

మొగుళ్లపల్లి: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు వాగులో మునిగి చనిపోయారు. ఈ విషాద ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాల వాగులో సోమవారం సాయంత్రం జరగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కొర్కిశాలలోని మోడల్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు, ఇస్సిపేట చెందిన ముగ్గురు, రంగాపురానికి చెందిన ఒకరు, లక్ష్మీపురానికి చెందిన ఒకరు మొత్తం ఏడుగురు విద్యార్థులు పాఠశాలకని బయల్దేరి మొగుళ్లపల్లి బస్టాండ్ కూడలిలో కలుసుకున్నారు. పాఠశాలకు వెళ్లకుండా కొర్కిశాల వాగుకు ఈతకు వెళ్లారు. వాగులో దిగి ఈత కొడుతుండగా మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన బండారి కొమురయ్య–సమ్మక్కల రెండవ కుమారుడు అఖిల్ (14)తో పాటు రంగాపురం గ్రామానికి చెందిన వురుసుల కుమారస్వామి కావ్యల కుమారుడు హర్షవర్ధన్(14)లు లోతట్టు ప్రాంతానికి వెళ్లి గల్లంతయ్యారు. మిగతా విద్యార్థులు భయపడి విషయాన్ని గోప్యంగా ఉంచారు. రాత్రి వరకు అఖిల్, హర్షవర్ధన్లు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై తోటి స్నేహితుల్లో ఒకరిని ఆరా తీయగా జరిగిన విషయం చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, స్థానికులు వాగులో గాలింపు చర్యలు చేపట్టగా అర్ధరాత్రి 1 గంటకు రంగాపురం గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (14) మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం 7 గంటలకు అఖిల్ (14) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. విద్యార్థులు మృతిపట్ల అనుమానం ఉందన్న తండ్రి వురుసుల కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కాగా, పిల్లలందరూ ఈతకు వెళ్లేముందు కల్లు తాగినట్లు సమాచారం.

అన్నయ్య కావాలి...

రంగాపురం గ్రామానికి చెందిన మృతుడు హర్షవర్ధన్ చెల్లి హనీ 'నాకు అన్నయ్య కావాలి.అన్నయ్యతో మాట్లాడాలని, అన్నయ్యతో ఆడుకోవాలి'అంటూ ఏడుస్తుంటే బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.